# 45. 'బంద్'వులబ్బాయి కథ

వెనకటి కెవడో "నీ నెత్తిమీద తేలు ఉంది గురువా" అంటే "అదేదో నీచేత్తో నువ్వే తీసిపారెయ్యి శిశువా" అన్నాడట. అలాగా, చుట్టపు చూపుకని హైదరాబాదు ఒచ్చిన నన్ను మా మేనల్లుడు "దిల్ సుక్‌నగర్ వెళ్ళి ఆ సమాచారం కూడా కనుక్కొచ్చెయ్యి మామయ్యా" అని పురమాయించేడు.

మొన్న ఒకటో తారీఖు ఆదివారం నాడు హైదరాబాద్ చేరేను. "మంచి సమయానికొచ్చేవు మామయ్యా. ఇవాళ మా అమ్మాయిని చూడ్డానికి పెళ్ళివారొస్తున్నారు." అన్నాడు మా మేనల్లుడు.

వాళ్ళు రానూ వచ్చారు, ఆ తతంగం గంటసేపు అయ్యేక వెళ్ళనూ వెళ్ళేరు. అయితే యాదాలాపంగా "అయిదో తారీకుని ఓ సారి మా ఇంటికి రండి" అని వాళ్ళు అన్నమాటకి మావాళ్ళు సరే, సరే-అనేశారు.

నాలుగో తారీఖు రాత్రిదాకా ఈ సంగతి చర్చకి రాలేదు. "రేపు ఉదయం నేను మలక్‌పేట దాకా వెళ్ళాలి. కానీ రేపు బంద్ అంటున్నారు." అన్నాను.

"అదేకదా, ఈ జంట నగరాల్లో వచ్చిన చిక్కు! ఎప్పుడు బంద్ వస్తుందో ఎపుడు బంద్‌వులు వస్తారో చచ్చినా తెలీదు!" అని నా మీద జోకేశాడు మా మేనల్లుడు.

"ఏడిశావులే, నేను వస్తున్నానని పదిరోజులు ముందుగా నీకు ఉత్తరం రాసేను. ఈ బంద్ సంగతి కూడా మూడు రోజుల్నుంచే పేపర్లో వేస్తున్నారు."

"అబ్బే, ఊరికే అన్నాను మామయ్యా," అని మా మేనల్లుడు నవ్వేశాడు. సరే, ఎలాగా మలక్ పేట దాకా వెళ్తున్నావు కదా, అలా దిల్‌సుక్‌నగర్ దాకా వెళ్ళి మొన్నవచ్చిన పెళ్ళివారి అభిప్రాయం కనుక్కుని ఒచ్చీకూడదు?"

ఆ విధంగా రోడ్డెక్కాను. "బస్సులు అన్నీ కాకపోయినా కొన్ని అయినా తిప్పబడును. ఆటోలు యధావిధిగా నడుచును." అని పేపర్లలో వేశారేగాని, వచ్చిన బస్సులన్నీ "డిపో" అని బోర్డులు తగిలించుకు వెళ్ళాయి. ఆటోలు "యధావిధిగా" నడిచాయి. యధావిధిగా అంటే నిన్నటిదాకా ఎలాగో అలాగ అని అర్థం కదా. ఆటోల మీటర్లు కరెక్షన్ చెయ్యడం పని తూనికలు కొలతలు డిపార్టుమెంటువారు చెయ్యాలా లేక ఆర్.టి.ఒ. వారు చెయ్యాలా అనే తర్జన భర్జనలో నిన్నటిదాకా ఆటోలు తిరగలేదు. "యధావిధిగా అంటే నిన్నటిదాకా వలెనే ఈ రోజు కూడా తిరగవని కదా అర్థం!"

"మన కాలనీకి ఆటోలు రావుగానీ, కొద్దిగా నడిస్తే మెయిన్‌రోడ్డు వస్తుంది, అక్కడికి ఆటోలు రావచ్చు" అని ఎవరో ప్రోత్సహిస్తే సరేకదా అని "ఎర్రగడ్డ" దాకా నడిచి అక్కడ నిలబడ్డాను. నాతో వచ్చినాయనకి సరిగ్గా పదిహేను నిమిషాల్లో ఒక ఆటో "షేరింగు" పద్ధతిలో దొరికింది, జారుకున్నాడు.

అదుగో అప్పుడొచ్చి ఆగిందొక జీపు, నేను నిలుచున్న చోట.

"రండి, ఎక్కడిదాకా?" అన్నాడా జీపు డ్రయివు చేస్తున్న అబ్బాయి. తటపటాయించేను నేను.

"గుర్తు పట్టలేదా? నేనండి, శివనాధాన్ని, సర్వేశ్వరరావుగారి అబ్బాయిని!"

అంతే. చటుక్కుని ఎక్కాను. జీపు కదిలింది.

సరిగ్గా రెండేళ్ల కిందట ఈ శివనాధం ఒకనాడు విశాఖపట్నం వచ్చేడు. పొలిటిక్సుతో ఎమ్మే చదివి "భారతదేశంలో సత్యాగ్రహం - స్వరూప స్వభావాలు - పరిణామాలు" అనే సబ్జెక్టు మీద పరిశోధనా వ్యాసం రాసి డాక్టరేట్ కోసం ఆంధ్రా యూనివర్సిటీలో ఇవ్వడానికి వచ్చేడన్నమాట. ఆ రోజు విశాఖపట్నంలో బంద్ అయితేను, నా స్కూటర్ మీద అతన్ని యూనివర్సిటీ వరకు తీసుకెళ్లి సమయం మించిపోకుండా థీసిస్ వప్పగించడానికి సహాయపడ్డాను. అంతేకాదు, అతనేదో ఉద్యోగానికి దరఖాస్తు చేస్తే ఆ ఉద్యోగం అతనికొచ్చేలా చూడమని రికమెండ్ చేస్తూ మంత్రివర్గంలో ఉన్న నా క్లాస్‌మేట్ రంగయ్యకి ఉత్తరం కూడా రాసిచ్చాను.

"తరువాత ఏమైంది?" అని అడిగాను, జీపు కొంత దూరం పోనిచ్చి, కుశల ప్రశ్నలు అవీ అయిపోగానే.

"ఆ ఉద్యోగం నాకు రాలేదు."

"అయ్యో."

"రాకపోతే పోయిందిలెండి, కాని ఖాళీగా లేను."

"అంటే, ఏంచేస్తున్నావు?"

"రంగయ్య గారే నాకొక దారి చూపించేరు."

"అలాగా, సంతోషం, అయితే ఏమిటి నీ వ్యాపకం ఇప్పుడు?"

"నన్ను పార్టీలో చేర్చుకున్నారు. ఉద్యమాల నిర్వహణలో పరిశోధన, కార్యక్రమాలు అమలు చెయ్యడానికి పద్ధతులు రూపొందించడం-ఇవన్నీ నా పన్లు. పార్టీ ఆఫీసులో ఉద్యోగం కింద భావించి జీతం ఇస్తున్నారు."

"ఒక్క ముక్క బోధపడలేదు, నువ్వన్నది."

"బోధ పడకపోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. మీ కాలం నాడు చేసిందీ చూసిందీ కాదు."

"మరి బోధపరుస్తావా, లేకపోతే-"

"మీతో చెప్పడానికి మొహమాటం దేనికి?" అంటూ చెప్పాడు.

ఉదయం తొమ్మిదింటికి శివనాధం ఆఫీసుకి వెళ్తాడు. అన్ని వార్తా పత్రికలూ వస్తాయి. అవన్నీ చూసి సమ్మెలు, సత్యాగ్రహాలు, ధర్నాలు, బంద్‌లు నిర్వహించడానికి ఏమేమి అవకాశాలున్నాయో అలాటి వార్తలు గుర్తించి పెట్టుకుంటాడు. వార్తల్లో ఉండే సీరియస్‌నెస్‌కి అనుగుణంగా కార్యక్రమాలు సూచిస్తాడు. పార్టీ పెద్దలు ఇతని సూచనలను పరిశీలించి ఫలానా తేదీని ఫలానా వ్యక్తి నిరాహారదీక్ష అనో, ఫలానా తేదీని ఫలానా పెద్ద మనిషిని ఘెరావ్ చేయాలనో, ఫలానా బంద్ నిర్వహించాలనో నిర్ణయాలు తీసుకుంటారు, పార్టీ కార్యకర్తల్ని మోపు చేయడం, పోలీసు శాఖతో సంబంధాలు పెట్టుకోవడం, పత్రికలకి ఆయా సత్యాగ్రహ వార్తల్ని ముందుగా అందించడం - ఇవీ శివనాధం పనులు, విధులు.

'ముత్యాల ముగ్గు' సినిమాలో కంట్రాక్టరు జ్ఞాపకం వచ్చాడు, "కలాపోసనకి వేరే డిపార్ట్‌మెంటే పెట్టేశాను" అంటాడతను. "కళాపోషణ" కోసం ఒక స్త్రీని నియమించి, "ఒక్క పోట నాలుగు రోజులు డూటీ ఎయ్యకుండా" జనాన్ని లొంగదీయించుకుని వాళ్ల పన్లు చేస్తున్నట్టే కనిపిస్తూ తన సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటాడు.

"ఆఖరికి ఇంత చదువూ చదివి ఇదా నీకు దొరికిన వ్యాపకం?" అన్నాను.

"ఇదికూడా ఎవరో ఒకరు చెయ్యవలసిన పనేకదండీ? వెనకటి రోజుల్లో అయితే సరైన ఆలోచన, ప్రణాళిక లేక బంద్‌లు విఫలం అవడం, సత్యాగ్రహాలు చప్పగా చల్లారిపోడం జరిగేది. ఇప్పుడు అంతా ఆర్గనైజుడుగా నడుస్తోంది. బంద్‌లు విజయవంతం అవుతున్నాయి."

"బంద్‌లు విజయవంతం కావడమంటే ప్రజలు ఓడిపోవడమేకదా."

"కావచ్చు. దానికి ఎవరేం చేస్తారు?"

"మరి అన్ని రాజకీయ పార్టీలూ అట్టడగు వర్గాలకి సేవ చెయ్యడం కోసమే పుట్టాం అంటున్నాయి కదా. ఇందులో ఏ ఒక్క పార్టీ కూడా బంద్ జరిపే రోజున అట్టడుగు వర్గాలు ఆదాయం వదులుకుని పస్తులు పడుకుంటుంటే ఆ సంగతి పట్టించుకోదేమి?"

"అట్టడగు వర్గాల వోట్లు పోకుండా చూసుకోడం ముఖ్యమైన ధ్యేయం. మిగతావన్నీ కర్మ సిద్ధాంతానికి సంబంధించినవి."

"అయితే బంద్‌లూ సత్యాగ్రహాలూ నిర్వహించేటప్పుడు జరిగే లూటీలూ, గృహ దహనాలూ కూడా ప్లాన్ చేస్తున్నావా?"

"అన్నీ ప్లాన్ ప్రకారమే జరుగుతాయి. వాటికి వేరే 'కార్యకర్తలు' ంటారు. ఆ 'కార్యకర్తలు' అవి సరిగ్గా అమలు చేస్తున్నారో లేదో చూడ్డానికి పార్టీ 'దళపతులూ' 'నాయకులూ' ఉంటారు."

"పోనీలే. కనీసం అలాంటి పనుల్లో తలదూర్చకుండా ఉన్నావు. అందుకు సంతోషిస్తున్నాను. కానీ ఇదేదో శాశ్వతం అనుకుని దీంట్లో ఉండిపోకుండా ఒక ఉద్యోగం సంపాదించుకో. దీంట్లో ఏమీ సమస్యలు లేవనుకోకు."

"సమస్యలు లేకపోవడమేమీ? ఇప్పుడు రెండు సవాళ్లు వచ్చి కూర్చున్నాయి. 'బంద్' ల విషయమే తీసుకుంటేను-"

"చెప్పు చెప్పు-"

"మొన్న నొకవూళ్లో పెద్దలందరూ కలిసి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల్ని వ్యాపారస్తుల్నీ ఒకచోట చేర్చి ఆవూళ్లో ఇకమీదట బంద్‌లు నిర్వహించకూడదని తీర్మానించి ఏకగ్రీవంగా ఆమోదం పొందేరు. దాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఏదైనా ప్రణాళిక రూపొందించమని ఆదేశాలు వచ్చాయి."

"అవునుట, పేపర్లో చదివాను. ఆ వూళ్ళో బంద్‌లు వద్దనుకుంటే పోనీ, మరెన్ని వూళ్లు లేవుగనుక! ఇంకోటేమిటిట?"

"ఈ వూళ్లో ఒక పెద్ద మనిషి ఇంకో ప్రతిపాదన పెట్టాడు, అయ్యా, రాజకీయ నాయకులారా, మీరు మాటిమాటికీ బంద్‌లు ప్రకటించి జనాలకి పన్లు కాకుండా అడ్డు వస్తున్నారు, ఇలా సడెన్‌గా బంద్‌లు ప్రకటించే బదులు ప్రతినెలా ఏ పదో తారీఖునో, లేక రెండవ బుధవారమో

ఇలా నిర్ణయించి ఆ దినాన్ని తప్పనిసరిగా బంద్ దినంగా ప్రకటిస్తే ఎవరి జాగ్రత్తమీద వారు ఉంటారు - అని, ఆ ప్రతిపాదన.''

"దానికి మీరందరూ ఒప్పేసుకోవచ్చుననుకుంటాను. మీక్కావలసింది బంద్‌లు, అలా నిర్ణయమైన రోజున మీపార్టీ కారణం మీది, ఇంకో పార్టీ కారణం వాళ్లది. ప్రజలందరూ అదొక సెలవుదినంగా పరిగణించుకుని, ఇళ్లల్లో కూర్చుంటారు, హాయిగా.''

"గొప్ప గడుసుతనమే, మేం బంద్‌లు నిర్వహించడం - ప్రజలు హాయిగా ఉండడానికి కాదు. ప్రజల్ని ఎలాగో ఓలాగ కాల్చుకు తినాలని కదా! మీరు ఇలాటి సలహాలు చెప్తారని తెలియక ఏదో పెద్దవారు కదా అని జీపు ఎక్కమన్నాను. దిగండి!'' అని జీపు ఆపాడు శివనాధం.

ఆవిధంగా, ఇంటికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో చిక్కడిపోయాను. ★

# 46. మరిచిపోయే కథ

**ఒ**కసారి నేను హైదరాబాదు నుంచి విశాఖపట్నం ఒద్దామని గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి టిక్కెట్టు కొనుక్కుని రిజర్‌వేషన్ చేయించుకుని రైలెక్కేను. ఒక చిన్న బ్రీఫ్‌కేసు ఒక చేత్తోనూ, కాలుతూ వున్న సిగరెట్టు రెండో చేత్తోను పట్టుకుని, "చిన్న శాస్త్రి'' అని మేమంతా పిల్చుకునే గుంటూరు సుబ్రహ్మణ్యశాస్త్రి సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆ రైలెక్కేడు. తనకి కిటికీ దగ్గిర సీటూ కింది బెర్తూ రిజర్‌వేషన్ అయ్యేయి. ఐనా కిటికీ దగ్గిర అంతకి ముందునుంచీ కూర్చున్న ఒకానొక స్ఫురద్రూపికి ఆ కిటికీ సుఖం వదిలేసి, మా చిన్న శాస్త్రి బెర్తు మధ్యని ఎడ్జస్టయ్యేడు. అయితే ఆ స్ఫురద్రూపి గారు ఎడ్జస్టు అవలేదు. సిగరెట్టు అయిపోగానే పారేడానికి చిన్నశాస్త్రి ఆయన మీదుగా కిటికీలోంచి వంగినపుడు "ఎక్స్‌క్యూజ్ మీ, మీరు స్మోక్ చేస్తారు గాబోలు; ఈ చివర కూర్చోండి'' అని లేచిపోయి, తనకి రిజర్వేషన్ ఇచ్చిన మధ్యసీటుకి మారిపోయాడు.

ఓ అరగంట కబుర్లు చెప్పుకున్నాక కాఫీ అబ్బాయి ఒస్తేను, నేను: నాకూ చిన్నశాస్త్రికీ రెండిమ్మన్నాను. శాస్త్రి "మూడు'' అన్చెప్పి ఆ స్ఫురద్రూపి గారిక్కూడా ఓ కప్పు ఇప్పించేడు.

ఆయన శాస్త్రికి థాంక్స్ చెప్పి కాఫీ తాగేశాడు. (మూడు కాఫీలకీ డబ్బులు నేనే ఇచ్చాను; అది వేరే సంగతి!)

కాఫీ తాగ్గానే చిన్న శాస్త్రి మళ్లీ సిగరెట్టు వెలిగించేడు. ఆ స్ఫురద్రూపి శాస్త్రితో "కాఫీ సిగరెట్టుకి మంచి బేస్'' అన్నాడు నవ్వుతూ. "కిళ్ళీకి భోజనంలాగా?'' అని నేను మాట కలపబోయాను. వాళ్లిద్దరూ వినిపించుకోలేదు. "మీరు కూడా ఒకటి కాల్చండి!'' అని చిన్న శాస్త్రి అతనికెదురుగా తన సిగరెట్ పెట్టె తెరచి, ఒక సిగరెట్టుని సహం మేరకు లాగి అతని మీదికి తుపాకీలా గురిపెట్టాడు. "థాంక్యూ'' అని అతను సిగరెట్టు అందుకుని, పెదిమల్లో బిగించి, ప్యాంటు జేబులో చెయ్యి పెట్టేడు. చిన్న శాస్త్రి తన రెండో చేతిలో సిద్ధంగా వున్న అగ్గిపెట్టె లకలక లాడిస్తూ అందించబోయాడు. కాని, ఆ స్ఫురద్రూపి చిరునవ్వుతో "అగ్గిపెట్టె మేంటేన్ చేస్తున్నాలెండి!'' అని చెప్పి తన స్వంత పెదవుల మధ్య ఉన్న పరాయి సిగరెట్టుని స్వంత అగ్గిపెట్టెతోనే వెలిగించుకున్నాడు.